www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 మే 2024

8 పేజీలు





ఏలూరు పశ్చిమ గోదావరి

నేడే పోలింగ్..



ఆచంట మండలంలో పుచ్చలంక నుంచి అయోధ్యలంకకు వెళ్లేందుకు పడవ ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది



ఏలూరులో సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరిన సిబ్బంది

2024 సాధారణ ఎన్నికల ఘట్టం చివరి అంకానికి చేరింది. సోమవారం జరగనున్న పోలింగ్‌కు రెండు జిల్లాల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రధాన పార్టీలన్నీ ఆఖరిరోజు తమ సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతున్నాయి.

- రెండు జిల్లాల్లోనూ ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ పోలింగ్
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన ఉద్యోగులు
- పశ్చిమలో 14.72 లక్షల మంది ఓటర్లు, 1463 పోలింగ్ కేంద్రాలు
- ఏలూరు జిల్లాలో 16.37 లక్షల మంది ఓటర్లు, 1744 పోలింగ్ స్టేషన్లు
- విభిన్న ప్రతిభావంతులకు, వృద్ధులకు వీల్‌చైర్స్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు
- పోటీ పడి డబ్బు పంపకాలు పూర్తి చేసిన అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14,72,923 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 1,463 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 282 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల్లో బందోబస్తు మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఎన్నికల సామగ్రి తీసుకెళ్లేందుకు, తర్వాత స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు 581 వాహనాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు పిఒ, ఎపిఒ, ఓపిఓలు మొత్తం 3,811 మందిని నియమించారు. వీరంతా ఆదివారం సాయంత్రానికి ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఇవిఎంలను భీమవరంలోని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, విష్ణు కాలేజీలో భద్రపర్చేలా ఏర్పాట్లు చేశారు.

ఏలూరు జిల్లాలో 16.37 లక్షల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. దీనికోసం 1,744 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో 414 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇక్కడ పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు 1,069 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది కోసం 600 వాహనాలను ఏర్పాటు చేశారు. బందోబస్తుకు సంబంధించి మూడు వేల మంది పోలీసులను నియమించారు. పిఒ, ఎపిఒ, ఒపిఒలు దాదాపు నాలుగు వేల మంది వరకూ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ క్యాంపు వంటి ఏర్పాట్లతోపాటు విభిన్నప్రతిభావంతులకు, వృద్ధులకు వీల్‌చైర్లు వంటివి ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ రెండు జిల్లాల్లోనూ 144 సెక్షన్ విధించారు. ఏ నలుగురు గుమిగూడినా పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికల రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల వరకూ రాజకీయ ప్రచారాలు చేయకుండా ముందుగానే బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ఎలా సాగుతుందోననే ఉత్కంఠ సర్వత్రా కొనసాగుతోంది.



నరసాపురంలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది సందడి

డబ్బు పంపకాలు పూర్తి..

ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. అత్యధిక నియోజకవర్గాల్లో ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేయగా, ఉంగుటూరు, భీమవరం, ఆచంట వంటి నియోజకవర్గాల్లో ఓటుకు రూ.రెండు వేల వరకూ పంపిణీ చేసిన పరిస్థితి ఉంది. ఒక్కో నియోజకవర్గంలో రూ.30 నుంచి రూ.50 కోట్లు ఈ రెండు, మూడు రోజుల్లోనే కుమ్మరించిన పరిస్థితి ఉంది. డబ్బు పంపకాల్లో అధికారపార్టీ అభ్యర్థుల దూకుడు కొనసాగింది. డబ్బు పంపకాలు పూర్తి కావడంతో సోమవారం జరిగే ఎన్నికల ప్రక్రియపై అభ్యర్థులు దృష్టి సారించారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేరవేసేందుకు ఆటోలు, వ్యాన్లు వంటి వాహనాలను ఏర్పాటు చేశారు. ఉదయం పూటనే ఓటర్లను తరలించి ఓటు వేయించేలా ప్రణాళికలు రచించారు. ఓటర్లను తీసుకెళ్లేందుకు ఇరు పార్టీలూ పోటీపడే పరిస్థితి కన్పిస్తోంది.

అన్నమో.. రామచంద్రా..!

- సామగ్రి పంపిణీ కేంద్రంలో అర్థాకలితో సిబ్బంది విలవిల
- ఉదయం అల్పాహారమూ అరకొరే
- ఏర్పాట్లపై పోలింగ్ సిబ్బంది అసహనం





సాంబారు, కూరల కోసం అన్నం ప్లేట్లతో ఎదురుచూస్తున్న ఉద్యోగులు, కూరలు రాకపోవడంతో వదిలేసిన భోజనాలు

వార్త మధ్య పేజీలో..

ఓటు వేసేయండిలా


మధ్యపేజీల్లో..

ఎన్నికల అధికారుల ఫోన్ నెంబర్లు

6లో..

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

8లో..



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆదివారం ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్‌తోపాటు ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎల్.నిర్మల్‌రాజ్, ఉండి రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో మొత్తం 238 పోలింగ్ కేంద్రాలను 22 కౌంటర్లుగా విభజించి పోలింగ్ మెటీరియల్, ఇవిఎంల పంపిణీ సాగిందన్నారు. పోలింగ్ సిబ్బందికి ప్రతి సెక్టార్‌కు ఒక బస్సు కేటాయించామని తెలిపారు.

హోరాహోరీగా ప్రచారాలు

ప్రజాశక్తి - చింతలపూడి


చింతలపూడి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం హోరాహోరీన సాగి శనివారం ముగిసింది. పోటా పోటీగా అభ్యర్థులు ప్రచారం సాగించారు. టిడిపి నుంచి వైసిపిలోకి, వైసిపి నుంచి టిడిపిలోకి, వైసిపి నుంచి కాంగ్రెస్‌లోకి ఇలా ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి చేరికలు జరిగాయి. దీంతో చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి ఉమ్మడి పొత్తు, వైసిపి, కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాలు ముమ్మరం చేశారు. నువ్వా.. నేనా అన్నట్లుగా ప్రచారాలు సాగాయి. బరిలో ఉన్న మూడు పార్టీల అభ్యర్థులు అవకాశం కోసం వారు తమ ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా కూడా ఎన్నికల ప్రచారం జోరుగా చేశారు. దీంతో మూడు పార్టీల ప్రచారంతో చింతలపూడి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం గతంలో లేని విధంగా జరగబోతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

టిడిపి అభ్యర్థి సొంగ కుమార్ టిడిపి అధిష్టానం మొదటి లిస్టులోనే తన పేరు ప్రకటించింది. తనకి కులమత బేధాలు లేవు, డబ్బు సంపాదించుకునే ఆలోచన లేదు, ఇప్పటివరకు చూడని ఒక అభివృద్ధిని 2024 నుంచి చూస్తారని ప్రమాణం చేసి ప్రజలకు హామీ ఇస్తున్నారు. అత్యధిక మెజార్టీతో మీరు నన్ను గెలిపించండి, అభివృద్ధి అనేది నాకు వదిలేయండి అని బలంగా ప్రచారం సాగించారు. తాను చేసిన సేవా కార్యక్రమాలు చూడండి, అభివృద్ధి చేసి చూపిస్తానని, అభివృద్ధికి ఒక నూతన శ్రీకారం చుడతానని ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

గెలుపుపై ఉత్కంఠ


కంభం విజయరాజు


సొంగ రోషన్


ఉన్నమట్ల ఎలిజా

వైసిపి అభ్యర్థి కంభం విజయ రాజు అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా చింతలపూడి నియోజకవర్గంలో ఒక నూతన మార్పు తీసుకు వస్తానని చెబుతున్నారు. రాజకీయాలకు డబ్బు కోసం రావడం లేదని, ప్రజలకు మేలు చేసి మంచి పేరు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగించారు. ఉదయం వాక్ విత్ కెవిఆర్ అంటూ పట్టణంలో తిరిగారు.

బెట్టింగులు కూడా టిడిపివైపే..

చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి ఉమ్మడి కూటమి గెలుస్తుందని పందేలు జోరుగా సాగుతున్నాయి. లక్షకి లక్షన్నరగా పందేం సాగుతున్నట్లుగా తెలుస్తుంది. ఒక్క చింతలపూడి నియోజకవర్గంలోనే 50 కోట్లపైగా బెట్టింగ్ జరిగినట్టుగా సమాచారం. టిడిపి అభ్యర్థిగా సొంగ రోషన్ కుమార్‌ను ప్రకటించిన దగ్గర నుంచి ప్రజల్లో టిడిపి గెలుస్తుందని ప్రచారం కొనసాగింది. మధ్య మధ్యలో కొన్ని జరిగినా అవి అభ్యర్థి చేసిన సేవా కార్యక్రమాల దృష్ట్యా జనాల్లోకి వెళ్లలేదు. ఏదైనా పోటీ అనేది రసవత్తరంగా ఉండబోతోంది. ఏ అభ్యర్థి విజయం అనేది ఈజీగా అంచనా వేయలేని పరిస్థితి.. గెలుపెవరిదో వేచి చూడాలి.

కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా ఆత్మ గౌరవం కోసం పోటీ చేస్తున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని, కాంగ్రెస్ హయాంలోనే రైతులకు రుణమాఫీ చేశారని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి న్యాయం జరుగుతుందని ప్రచారం చేశారు. టిడిపి, వైసిపికి ఓటు వేస్తే బిజెపికి వేసినట్లేనని, బిజెపిని గెలిపిస్తే రిజర్వేషన్లు తీసేస్తారని, కాంగ్రెస్‌తోనే అన్ని తరగతులకు మేలు జరుగుతుందని ప్రచారం చేశారు. ఎపి పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల చింతలపూడిలో ప్రచారం చేయటంతో కాంగ్రెస్ పూజుకుంటుందని అభిప్రాయం పడుతున్నారు.

చింతలపూడి నియోజకవర్గంలో నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు, బిఎస్‌పి అభ్యర్థి పోటీలో ఉన్నారు. వీరు సుమారుగా ఐదువేల వరకూ ఓట్లు సాధిస్తామని చెబుతున్నారు.

చింతలపూడి ని యోజకవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి ఓట్లు సుమారుగా 90 వేల వరకు ఉన్నాయి. కాపు ఓట్లు సుమారుగా 30 వేల వరకు ఉన్నాయి. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా కాపు ఓట్లు కూటమికి పడతాయని అనుకుంటున్నారు. కాని వైసిపిలో కూడా బలమైన కాపు నాయకులు ఉన్నారు. టిడిపి, జనసేన బిజెపితో పొత్తు పెట్టుకోవడం వల్ల మైనార్టీల ఓట్లు పడే అవకాశం లేదు. దీంతో కాంగ్రెస్‌కి లేదా నోటాకి కూడా ఓట్లు ఎక్కువ పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేకుల అభిప్రాయం. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు టిడిపికి ఎక్కువగా పడినట్లుగా అంచనా.

పకడ్బందీగా పోలీస్ బందోబస్తు

డిఎస్‌పి జనార్ధన్

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి జనార్ధన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఆదివారం మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో ఉన్న 286 పోలింగ్ కేంద్రాలలో 1509 లొకేషన్స్ ద్వారా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ట్రెయినీ ఐఎస్‌లు ముగ్గురు, డిఎస్‌పిలు ఇద్దరు, సిఐలు ముగ్గురు, ఎస్‌ఐలు పదిమంది, ఎఎస్‌ఐలు 50 మంది, సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది 100 మంది, హోంగార్డులు వందమంది, కానిస్టేబుల్స్ 200 మంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు జరుగుతుందని, నలుగురికి మించి గుమ్మిగూడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు స్థానిక సెలవు

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 13న అన్ని కార్యాలయాలకు లోకల్ హాలిడే(స్థానిక సెలవు)ను ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఖజానా, ఉప ఖజానా కార్యాలయాలు, అత్యవసర సేవల విభాగాలకు దీనిలో మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ పూర్తి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలం వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఇవిఎంలు, వివి ప్యాట్ లు, బ్యాలెట్ పత్రాలు, ఇతరత్రా ఎన్నికల సామగ్రిని ఆయా సెక్టార్ల వారీగా బస్‌లలో పంపిణీ చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్‌వి.వెంకటేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ బూత్‌కి సంబంధించి సిబ్బంది కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా వుండేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు.


తవ్వకం అడ్డుకుంటున్న అధికారులు

చెరువు అక్రమ తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ చెరువు తవ్వకాలను అధికారులు ఆదివారం సాయంత్రం అడ్డుకున్నారు. పూళ్ళ గ్రామపంచాయతీ పరిధిలోని మల్కీ మహమ్మద్ పురం-సాయం పాలెం ఆవాస ప్రాంతాల మధ్యలోని రెవెన్యూ సర్వే నంబర్లు 1392-1393 మధ్యలో 25 ఎకరాల విస్తీర్ణంలో అక్రమ చెరువు తవ్వకాలను మన్నెం బాబుజీ అనే రైతు చేపట్టి తవ్వకాలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, అటవీ, వన్యప్రాణి సంరక్షణ(అటవీ శాఖ)లకు చెందిన అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడులను నిర్వహించారు. తవ్వకాలను నిలిపివేశారు. తవ్వకం పనుల్లో పాల్గొన్న రెండు జెసిబిలను స్వాధీనపరచుకున్నారు. రైతుపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

ఓట్లు.. పాట్లు..

ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బందికి తప్పని అవస్థలు

ఎండ, ఉక్కపోతతో విలవిల

ప్రజాశక్తి - కైకలూరు

వెంకి పెళ్లి.. సుబ్బి చావుకు వచ్చినట్లుగా ఉంది ఈ సార్వత్రిక ఎన్నికల పని. వేసవి కాలం కావడం అధికారులకు తిప్పలు తెచ్చిపెట్టాయి. ఓట్లతో ఎన్నికల సిబ్బంది నానా అవస్థలు పడాల్సి వచ్చింది. సోమవారం పోలింగ్ సందర్భంగా కైకలూరు మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. పంపిణీ కేంద్రం వద్ద షామియానాలు ఏర్పాటు చేసి నీడ కల్పించినప్పటికీ ఎండ వేడిమి వల్ల గాలి లేక ఉక్క పోతతో సిబ్బంది అవస్థలు పడ్డారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల సిబ్బందికి ట్రెయినింగ్ కలెక్టర్ డి.శ్రీ పూజ, రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. పోలింగ్‌కు అవసరమైన ఇవిఎంలు, ఇతరయంత్ర పరికరాలను అందజేశారు. వీరంతా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి, ప్రయివేట్ బస్‌లతో పాటు ఇతర వాహనాలలో ఆయా కేంద్రాలకు సామాగ్రితో తరలి వెళ్లారు. అయితే కైకలూరు మండలంలోని కొల్లేరు లంక గ్రామాలకు చేరటానికి సిబ్బంది అవస్థలు పడ్డారు. రోడ్లు సక్రమంగా లేకపోవడం నరకాన్ని తలపించాయి. సర్కారు కాలువ దాటి పందిరిపల్లిగూడెం, గుమ్మళ్లపాడు, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, కొల్లేటికోట గ్రామాల్లోని పోలింగ్ బూతులతో పాటు కొట్టాడ, జంగంపాడు, రాజుల కొట్టడకు పోలింగ్ సామాగ్రిని చేర్చడం తలకు మించిన భారమైంది. పోలింగ్ విధులకు వచ్చిన సిబ్బంది రాత్రి సమయాల్లో ఆయా కేంద్రాల్లోనే జాగారం చేయాల్సి వచ్చింది. వేసవికాలం అయినప్పటికీ కొల్లేరు ప్రాంతంలో దోమల పోటు తీవ్రంగానే ఉంది. మొత్తానికి నానా అవస్థలు పడి పోలింగ్ సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు చేర్చాల్సి వచ్చింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితోపాటు ఆయా తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఎంతో కృషి చేశారు.


నువ్వా.. నేనా.. అన్నట్టు సాగిన ప్రచారం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు డివిజన్ పరిధిలో నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం నువ్వా నేనా.. అన్నట్లు హోరాహోరీగా సాగింది. ఎన్‌డియే కూటిమి అభ్యర్థి కొలుసు పార్ధసారధి, వైసిపి అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఇండియా వేదిక అభ్యర్థి మరీదు కృష్ణ, మరో ఏడుగురు స్వతంత్ర్య అభ్యర్థులు గత రెండు నెలల నుంచి ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలనుసారం ప్రచారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థి కొలుసు పార్ధసారధి తమతో పాటు తమ భార్య, కూమారుడు, కోడలు, ఎవరికి వారే నాలుగు మండలాలైన ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, నూజివీడు, నూజివీడు టౌన్ పరిధిలో ప్రణాళిక ప్రకారం ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. నూజివీడు టౌన్ పరిధిలో సమస్యలైన పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ భాగోకపోవడం, రోడ్లు పరిస్థితి అంతంత మాత్రం వుండటం, టిడ్కో ఇండ్లు గత ఐదు సంవత్సరాల నుంచి లబ్ధిదారులకు ఇవ్వకపోవడం, నూజివీడు రూరల్ మండలాల్లో ఇండ్ల స్థలాల సమస్యలతో పాటు ఆధాన్యంగా దర్శనిమిస్తున్న రోడ్లు బాగోకపోవడం వంటి సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఓటర్లు డబ్బులకు, మద్యానికి ప్రలోభపడి ఓట్లు వేస్తారా? లేక నిజాయితీగా అభివృద్ధి చేసే నాయకున్ని ఎన్నుకుంటారా చూడాలి. నూజివీడు నియోజక పరిధిలో ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు రూరల్, చాట్రాయి, నూజివీడు టౌన్ పరిధిలో 1,18,104 పురషుల ఓటర్లు వుండగా, 1,20,867 మంది మహిళా ఓటర్లు, మరో పది మంది జెండర్ ఓటర్లు ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ముసునూరు, చాట్రాయి వంటి వ్యవసాయాక పంటలు పండించే మండలాలు కావడంతో, ప్రజాశక్తి కథనాల్లో పలుమార్లు పలు సమస్యలతో ప్రజలు ఎన్నో ఇబ్బందిలు ఎదుర్కుంటున్నారని ప్రతికాముఖంగా తెలియజేసినా.. ఏ నాయకుడు సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదు. మూడు సార్లు గెలిచి తాను లోకల్ అని చెప్పుకునే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ప్రజలు పట్టం కడతారో, పెనుమలూరు వైసిపి ఎంఎల్‌ఎ కొలుసు పార్ధసారధి టిడిపి తీర్థం పుచ్చుకుని ఎన్‌డియే కూటిమి అభ్యర్థిగా నిల్చున్న వ్యక్తికి పట్టం కడతారో, ఎన్నో ఏండ్లు పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఎన్నో సేవలందించి, రైతు రుణమాఫీ లాంటి పథకాలు పెట్టి పేదల అభ్యున్నతికి కృషి చేసే కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నమాట్ల ఎలిజాకి పట్టం కడతారో వేచి చుద్దాం. ఏది ఏమైనప్పటికీ నూజివీడు నియోజకవర్గం ఎన్నో సమస్యలతో విలవిలడుతున్నా ప్రజలకు ఎవరొచ్చి మేలు చేస్తారో, ఎన్నికల్లో తెలుతుందని చెప్పవచ్చును.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే


మేకా అప్పారావు


పార్థసారథి


ఎమ్.రామకృష్ణ

ముఖ్య వార్తలు

సోమవారం 13 మే 2024

భీమవరం.. గరం..గరం

నియోజకవర్గంలో త్రిముఖ పోటీ



గ్రంధి శ్రీనివాస్ | అంజిబాబు | సీతారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో ఎన్నికలు జరిగినప్పుడు భీమవరంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రాజకీయ విశ్లేషకులు ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఉన్న బడాబాబులు పారిశ్రామిక వ్యక్తులుగా, విద్యావంతులుగా అన్ని రంగాల్లోనూ ఉన్నారు. దీంతో భీమవరానికి అంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ప్రస్తుతం భీమవరం నియోజకవర్గంలో 2.53 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,22,790 మంది, మహిళలు 1,30,275 మంది, అదర్స్ 50 మంది ఉన్నారు. భీమవరం నియోజకవర్గంలో వైసిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, జనసేన నుంచి మాజీ ఎంఎల్ఎ పులపర్తి ఆంజనేయులు, కాంగ్రెస్ నుంచి అంకెం సీతారం పోటీలో ఉన్నారు. అధికార పార్టీకి చెందిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు మాస్ లీడర్ పేరు ఉంది. గతంలో టౌన్‌షిప్‌తో పాటు, భూమి కొనుగోలు వంటి స్థిర స్థాయిగా నిలిచిపోయే పనులు చేపట్టిన గ్రంధితోనే అభివృద్ధి సాధ్యమనుకున్న ప్రజలకు గడిచిన నాలుగున్నరేళ్లలో అడపా దడపా రోడ్లు తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శలు వినిపించాయి. నియోజ కవర్గ పరిధిలో జరిగిన కొన్ని వివాదాలు ఆయనకు మైనస్‌గా ఉన్నాయని ప్రజలు చర్చించుకున్నారు. వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ ప్రజల్లో మాత్రం ఎక్కడో తీరని వెలితి నెలకొందని, పార్టీపై ఉన్న వ్యతిరేకత వైసిపి గెలుపుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో వాటిని ధనబలంతో చక్క పెట్టాలని చేస్తున్న తీవ్ర ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే ఓటర్లకు పలు విధాలుగా డబ్బులు పంపిణీ పెద్దఎత్తున చేపట్టారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు గతంలో పదేళ్ల ఎంఎల్ఎగా చేసినప్పటికీ ఆయన మార్క్ చూపించే పనులు చేయలేకపోయారని విమర్శలు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్న అంజిబాబు మళ్లీ ఈ ఎన్నికల్లో జనసేన కండువా కప్పుకుని ఆ పార్టీ నుంచి ఎంఎల్ఎగా పోటీలో దిగారు. దీంతో అంజిబాబు పరిపాలన సమయంలో అభివృద్ధిపై ఎటువంటి చర్చ పెట్టని ఓటర్లు అంజిబాబు సౌమ్యుడని, వివాదరహితుడనే కోణంలో ఆలోచిస్తున్నారు. ఈ పరిణామం అంజిబాబుకు కలిసి అంశంగా ఉంది. వైసిపిపై, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌పై వ్యతిరేకత అంజిబాబుకు మరింత బలం చేకూరిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గెలుపు కోసం వైసిపి, జనసేన అభ్యర్థులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దఎత్తున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని ప్రజలు చర్చించుకుం టున్నారు.

ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారాం భీమవరం నియోజవర్గానికి కొత్త అయినప్పటికీ సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి పార్టీ శ్రేణులకు ప్రచారంలో కొత్త ఉత్సాహాన్ని చూపించారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కనుమరుగైన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సమయంలో ఇండియా వేదిక తరపు కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థిగా సీతారాం బరిలో నిలిచారు. ఆయనకు ఎవరూ ఊహించిన విధంగా మంచి ఓటింగ్ పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

లంక గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మండలంలో లంక గ్రామాలు ఉన్నాయి. లంక గ్రామాలు గోదావరి మధ్యలో ఉంటాయి. ఈ గ్రామాల్లో సుమారు నాలుగు వేల మంది ఓటర్లు ఉన్నారు. అయోధ్యలంకలో రెండు, పుచ్చలంక, ఆనగార్లంకలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో ఈ పోలింగ్ కేంద్రాలకు ఆచంట మండలం కరుగోరుమిల్లి రేవు నుంచి రెండు పడవల్లో అయోధ్యలంక వెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి చొరవతో ఆచంట నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు ఎన్నికల సిబ్బంది బస్సుపై సామగ్రిని తీసుకెళ్లారు. పుచ్చలంక నుంచి అయోధ్యలంకకు వెళ్లేందుకు పడవలను ఏర్పాటు చేశారు. దీంతో రెండు గోదావరి రేవులను దాటాల్సిన ఎన్నికల సిబ్బంది ఒక గోదావరిని దాటడంతో కొంత సమయం కలిసొచ్చింది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను పడవలపై సురక్షితంగా తీసుకెళ్లేందుకు అవసరమైన బోట్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం అక్కడ నుంచి నేరుగా భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాలకు తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఇవిఎంఎల, సిబ్బంది

ఆచంట నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 187 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 187 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 748 మంది ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరితో పాటు పోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్లు, బూత్‌ల ఆఫీసర్లు, ఇతర సహాయ సిబ్బందిని నియమించామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్‌కు సంబంధించి రిజర్వ్‌తో సహా అసెంబ్లీకి 224 బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, పార్లమెంట్‌కు సంబంధించి 243 కేటాయించమన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు, పోలింగ్ అధికారులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించామన్నారు. నియోజకవర్గం మొత్తం 19 మంది రూటు ఆఫీసర్లు విధుల్లో చేరారన్నారు. అన్ని పోలింగ్‌స్టేషన్లలో కలిపి 55 బస్సులను ఏర్పాటు చేశామని, 455 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇవిఎంలో ఏదైనా సమస్య వస్తే సెక్టార్ అధికారుల ద్వారా బెల్ ఇంజినీర్స్‌కి సమాచారం అందించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. తహశీల్దార్లు ఐపి శెట్టి, ఆర్‌వివి.రోహిణి దేవి, కె.లక్ష్మీకళ్యాణి, ఎంపిడిఒలు పి.నరసింహప్రసాద్, ఎస్.శ్రీనివాసుదొర, పి.పద్మజ, డి.సుహాసిని, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాంప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

నరసాపురం.. పోటీ రసవత్తరం

నియోజకవర్గంలో ముగ్గురి మధ్య ప్రధాన పోటీ



ప్రసాదరాజు



నాయకర్



కానూరి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగుతుంది. నియోజవర్గంలో మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థి కంచన రమేష్ నాయుడు ఎన్నికల చివరి సమయంలో జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు మద్దతు పలికారు. ప్రస్తుతం వైసిపి నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, జనసేన అభ్యర్థిగా బొమ్మిడి నాయకర్, కాంగ్రెస్ నుంచి కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్ (బుజ్జి) పోటీలో ఉన్నారు. 11 మందిలో మొత్తం ముగ్గురు నాయకర్లు ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఓటర్లను ప్రభావితం చేసేందుకు కుల, మత, ప్రాంతాలు, సంఘాలు, వృతు ల వారీగా ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు. కాం గ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కర్ కృష్ణప్ర సాద్(బుజ్జి)కి సిపిఎం, సిపిఐ మద్దతు ఉంది. ఇతను స్థానికుడు కావడంతో కలిసొచ్చే అవకాశం ఉంది.

పొత్తులో భాగంగా నరసాపురం సీటు జనసేనకు కేటాయించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పవన్ సమక్షంలో జనసేనలో చేరినప్పుడు ఆయన కూడా పోటీలో ఉంటారని అందరు భావించారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా రావాలని ఆయన అనుచరులు భావించారు. కాని మాజీ మంత్రి పితాని సమక్షంలో జనసేనకి మద్దతు పలికారు. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు మద్దతుగా మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న, టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి కొవ్వలి రామ్మోహన్ నాయుడు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ఒంటరిగా ప్రచారం నిర్వహించారు. బొమ్మిడి నాయకర్‌కు గత ఎన్నికల్లో ఓడిపోవడం, కూటమి పార్టీల మద్దతు, పవన్‌కళ్యాణ్ క్రేజ్, చంద్రబాబు ఆశీస్సులు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. నాయకర్ వద్ద పనిచేసే సిబ్బందిపై, జర్నలిస్టులపై ఆయన పలుమార్లు దురు సుగా ప్రవర్తించడం, కలుపుగోలుతనం లేకపోవడం ఆయనకు కలిసిరాని అంశాలుగా ఉన్నాయి.ముదునూరి ప్రసాదరాజుకు సంక్షేమ పథకాలు, ఇంటింటికి పెన్షన్, గతంలో రాజకీయ అనుభవం, ఆర్థికంగా బలమైన వ్యక్తి, జగన్ ఈమేజ్, పట్టణంలో పెండింగ్‌లో ఉన్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్ నిర్మాణం, కాటన్ పార్క్ అభివృద్ధి ఆయనకు కలిసొచ్చే అంశాలు. మెడికల్ కాలేజీ, జిల్లా కేంద్రం తరలిపోవడం, గతంలో మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనకు మద్దతు తెలపడం కలిసిరాని అంశాలుగా ఉన్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు ప్రలోభాలకు తెర లేపాయి. ఒక ప్రధాని పార్టీ రూ.1500, చీర పంపిణీ చేయగా, మరొక పార్టీ రూ.1000 పంపిణీ చేశాయి. డబ్బు ప్రభావం ఎన్నికల్లో ఎలా ఉంటుందో తెలియాల్సి ఉంది. నియోజకవర్గంలో ఇద్దరి మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుంది. నరసాపురంలో బియ్యపు తిప్ప ఫిషింగ్ హార్బర్, పట్టణంలో డంపింగ్ యార్డ్, సఖినేటి పల్లి వంతెన దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్నాయి. నియోజక వర్గంలో పనులు పూర్తి కాలేదని ప్రజలు వాపోతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 169 బూత్‌లు ఉన్నాయి. వాటిలో 22 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయి. మంది ఎన్నికల సిబ్బందిగా నియమించారు.

పోలవరంలో గెలుపెవరిది..!

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గం పోలవరం. ఈ నియోజకవర్గంలో 12 మంది ఎంఎల్ఎ అభ్యర్థులు పోటీ దారులుగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా నలుగురి మధ్య పోటీ ఉండనుంది. అయితే వైసిపి నుంచి తెల్లం రాజ్యలక్ష్మి, జనసేన నుంచి చిర్రి బాలరాజు, కాంగ్రెస్ నుంచి దువ్వల సృజనల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో అందించిన నవరత్నాల సంక్షేమ పథకాలు, పేదల్లో ఉన్న ఆదరణే మరోసారి పోలవరం నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగురుతోందని వైసిపి నేతలు తెల్లం రాజ్యలక్ష్మి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమిలో ఉన్న విబేధాలు కూడా వైసిపికి కలిసొస్తాయని చెప్పుకుంటున్నారు. జనసేన నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా చిర్రి బాలరాజును ఏజెన్సీ టైగర్‌గా చెప్పుకుంటున్న కరాటం రాంబాబు నిలబెట్టారు. ప్రస్తుత ఎంఎల్ఎ తెల్లం బాలరాజుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, నిర్వాసితుల సమస్యలు, ఏజెన్సీలో రోడ్లు, డ్రెయినేజీ వంటి సమస్యలు పట్టించుకోకపోవడం వల్ల నిర్వాసిత ఓట్లు పడతాయని అనుకుంటున్నారు. కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వల సృజన ఏజెన్సీలో ప్రభావం చూపనుందని జోరుగా ప్రచారం సాగుతోంది. కమ్యునిస్టులకు ఏజెన్సీ లో ఉన్న పట్టు అధిక సంఖ్యలో ఓట్లు కొల్లగొట్టే అవకాశం కనిపిస్తోంది. ఏజెన్సీ ప్రాంతంలో నిర్వాసితుల సమస్యలపై పోరాటమే అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. నిర్వాసితుల మద్దతు ఎవరికి ఉంటుందోనని చర్చ నడుస్తోంది. టిడిపి రెబల్ అభ్యర్థిగా ఉన్న మొడియం సూర్యచంద్రరావు జనసేన కూటమికి తలనొప్పిగా మారాడని పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. టిడిపిలో కొన్ని ఓట్లు మొడియం సూర్యచంద్రరావు చీలుస్తారని, ఇది టిడిపి కూటమికి నష్టం చేకూరుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎన్నికల విధుల్లో తమిళనాడు హోం గార్డులు

ఎన్నికల విధుల్లో తమిళనాడు హోం గార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌కు తగిన ఎపి పోలీస్ సిబ్బంది లేకపోవడంతో తమిళనాడు హోం గార్డులను రప్పించారు. పాలకొల్లు నియోజకవర్గంలో 190 పోలింగ్ కేంద్రాలు ఉండగా సగానికి పైగా పోలింగ్ కేంద్రాలకు ఎపి పోలీస్ సిబ్బంది లేకపోవడంతో తమిళనాడు హోం గార్డులను డ్యూటీగా వేశారు. నాగాలాండ్ నుంచి వచ్చిన సిఆర్‌పిఎఫ్ దళాలు గత నెల రోజులుగా పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లో గస్తీ కాస్తున్నారు. నరసాపురం డివిజన్‌లోని పలు పట్టణాలు, గ్రామాల్లో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా సమస్య ఏర్పడితే తక్షణం ప్రత్యేక టీంలు, దళాలు స్పందిస్తాయి.

వైసిపికి గాదిరాజు సుబ్బరాజు రాజీనామా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపికి తాను రాజీనామా చేసినట్లు గాదిరాజు సుబ్బరాజు తెలిపారు. స్థానిక ఎఎస్ఆర్ నగర్‌లో ఉన్న ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన ఈ విషయం చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ తాను వైసిపి కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీలో చేరానని చెప్పారు. గత ఎన్నికల్లో తనకు ఎంపీ సీటు ఇస్తామని చెప్పారని, కొన్ని అనివార్య కారణాల వల్ల 2019లో కనుమూరి రఘురామకృష్ణంరాజుకు నరసాపురం ఎంపీ సీటు కేటాయించారని చెప్పారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు టిడిపి కూటమిలో చేరారని, అందుకే తాను కూడా వైసిపికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. పార్టీతో విబేధాలు ఏమీ లేవని చెప్పారు. ఎన్నికల అనంతరం భవిష్యత్ కార్యక్రమం ప్రకటిస్తానని తెలిపారు.

మాజీ మంత్రుల సమరం


ఆచంట నియోజకవర్గం

ప్రజాశక్తి - ఆచంట

రాజకీయ చైతన్యం కలిగిన ఆచంట అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆర్థికంగా బలవంతులు కావడం, ఇరువురు మంత్రులుగా పనిచేసి ఉండటంతో పోటీ రసవత్తరంగా మారింది. ఇక్కడ టిడిపి నుంచి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వైసిపి నుంచి మాజీ మంత్రి


చెరుకువాడ శ్రీరంగనాథరాజు


పితాని సత్యనారాయణ


ఎన్‌వి.సత్యనారాయణ

చెరుకువాడ శ్రీరంగనాథరాజు బరిలో ఉన్నారు. ఇరువురు ఉద్దండులే. ఎన్నికల్లో ఇరువురు నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతుండగా ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్) పోటీలో ఉన్నారు. నియోజకవర్గంలో ఈసారి 9 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

సిట్టింగ్ ఎంఎల్ఎ, వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకుతోడు కరోనా సమయంలో అందించిన సేవలు తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు మద్ద తుగా రుడా ఛైర్‌పర్సన్, వైసిపి నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు, ఇళ్ల పట్టాల్లో జరిగిన వసూళ్లు ఆ పార్టీకి కొంతనష్టాన్ని కల్గిస్తాయని పరిశీలకులు చెబుతున్నారు. వీటికితోడు పార్టీలో గ్రూపు విభేదాలు కూడా కొంత మైనస్‌గా చెప్పవచ్చు.


ఈసారి టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మొదటి నుంచి దూకుడుగా ఉంటూ ప్రచారంలో దూసుకుపోయారు. నియోజకవర్గంలో ఇంటింటా పాదయాత్ర నిర్వహించారు. దీంతోపాటు తన ఇద్దరు కుమారులు పితాని వెంకట్, భానుచంద్రతోపాటు కోడల్ని సైతం రంగంలోకి దింపి ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పితానికి మద్దతుగా ఈసారి ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఆచంటలో ప్రజాగళం సభ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పితానికి వెన్నుదన్నుగా బిసి ఓట్లు, జనసేన ఓట్లు ఉంటాయని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో విజయావకాశాలను దెబ్బతీసిన పెనుమంట్ర మండలంపై పితాని ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల యుద్ధంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ హ్యాట్రిక్ విజయం సాధిస్తారా, లేదా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జనాదరణతో రంగనాథరాజు విజయం సాధిస్తారా అనేది మరికొద్ది రోజులు వేచిచూడాల్సిందే.


నువ్వా.. నేనా..!

రాజకీయం వేడెక్కింది.. ఓటర్లు పదునెక్కారు.. ప్రచారపర్వం శనివారంతో ముగిసింది. ఇప్పటికే పార్టీలు పంపకాలు పూర్తి చేయగా, కొన్ని చోట్ల జోరందుకున్నాయి.. చీదరింపులు, మరికొన్ని చోట్ల వెక్కిరింపులు, ఇంకొన్ని చోట్ల బేరసారాలు.. సమాంతరంగా అధికారులు, ఉరుకులు, పరుగులు.. ఆంక్షల పేరిట పెద్దఎత్తున ప్రచారం.. మద్యం షాపులు శనివారం సాయంత్రం నుంచి మూసివేశారు. పోలింగ్ సిబ్బంది సర్వం సిద్ధం. పారా మిలటరీ బలగాల రాక. ఇక పోలింగ్ జరగడమే తరువాయి..

ముగిసిన ప్రలోభాలు - వేడెక్కిన రాజకీయం
ఎత్తుకు పైఎత్తులు - ఓటర్లకు బుజ్జగింపులు, బెదిరింపులు


కొఠారు అబ్బయ్యచౌదరి


చింతమనేని ప్రభాకర్


ఆలపాటి నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గంలో 16 మంది పోటీ పడుతున్నారు. వీరిలో 2 జాతీయ పార్టీలు కాగా, 2 అనుమతి పొందిన రాష్ట్ర పార్టీలు, 2 రిజిస్టర్ పార్టీలు కాగా, 2 రిజిస్ట్రేషన్ పొందనివి, 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు. వీరిలో ప్రధానంగా వైసిపి అభ్యర్థి కొటారు అబ్బయ్య చౌదరి, టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ మధ్యే పోటీ నెలకొంది. ప్రచార పర్వంలో అస్త్ర శాస్త్రలతో హోరెత్తించారు.

హోరాహోరీ ప్రచారం..

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి నియోజకవర్గంలో ఎండను సైతం లెక్కజేయకుండా గెలుపుకోసం ప్రచారాలతో హోరెత్తించారు. ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు సందడి చేశారు. దెందులూరులో టిడిపి అధినేత చంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. సమావేశంలో అమరావతి నుంచి పోలవరం వరకూ ప్రధాన ప్రాజెక్టులు పడకేసిన విధానాన్ని వివరించడంతోపాటు పరిశ్రమలు రాకపోవడంతో యువతకు ఏ విధంగా ఉద్యోగావకాశాలు చేజారిపోయాయో వివరించారు. వైసిపి అరాచక పాలన, స్థానిక నాయకుల అవినీతిపై విరుచుకుపడ్డారు. మరోవైపు దెందులూరులో సిద్ధం సభలో పాల్గొన్నారు.

పెల్లుబికిన అభిమానం..

ఎప్పటిలాగే ఎన్నికలు ఏప్రిల్‌లో ముగుస్తాయని అంతా భావించారు. మే 13న రాష్ట్రానికి ఎన్నికలు జరుపుతామని ఎన్నికల సంఘం ప్రకటించడంతో అభ్యర్థులకు 45 రోజులపాటు సమయం దొరికింది. దీంతోపాటు ఎన్నికల వ్యయం పెరిగింది. ప్రచారాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

మూడొంతుల మందికి ఓటుకు రూ.2 వేలు చొప్పున ఎరవేసినా అధికారంలోకి మేం వస్తామని బెదిరించినా ఉద్యోగులు ఎక్కడా తగ్గలేదు. ఇదే విషయాన్ని కూటమి తమకు అనుకూలంగా మలుచుకుంటోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక గాలి, ఉద్యోగుల ద్వారా బయటపడిందని, ఇక మిగిలిన ఓటర్లలో అంతకంటే రెట్టింపే ఉందని ఇప్పటికే ఓ నమ్మకానికి వచ్చింది.

అదిలింపులు, బెదిరింపులు..

పోలింగ్‌కు ఇంకా 36 గంటలు మిగిలి ఉండగానే, అప్పుడే అదిరింపులు, బెదిరింపులు ఆరంభమయ్యాయి. ఎన్నికల సంఘం పరిశీలకులు, పోలీస్, నిఘా సిబ్బంది ఒక కన్నేసినా ఇప్పటికే ఓటర్లను తమవైపు ఆకర్షించేందుకు వైసిపి అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేస్తోంది. నియోజకవర్గంలోని పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ పరిధిలో ఓటుకు రూ.1500 చొప్పున రూ.2 వేలు చొప్పున పంపిణీ చేశారు. డ్వాక్రా సంఘాలకు నగదు పంపిణీకి వీలుగా గ్రూప్ లీడర్లు, స్థానిక నేతలను వైసిపి వినియోగించుకుంది. కొన్ని సంఘాల్లో కీలకంగా కూటమి వైపు మొగ్గుచూపుతున్నారనే భావనతో అటువంటి వారందరిపైనా ఓ కన్నేసి ఉంచాం. ఎవర్నీ వదలమంటూ అధికారపక్షం నుంచి పరోక్ష బెదిరింపులు ఎదురవుతున్నాయి.

ఈ ఒక్కరోజు అత్యంత కీలకం..

ఎన్నికల ప్రచారం ముగిసింది. పోలీస్ బలగాలతోపాటు ఎన్నికల అధికారులు గట్టి నిఘా పెట్టారు. అనుమతి లేకుండా కళ్యాణ మండపాల్లో, అతిథిగృహాల్లో వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులు బస చేయడం గానీ, సమావేశం కావడం గానీ, ఎన్నికల నియమావళికి విరుద్ధం. ఇదే విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కడికక్కడ అతిథిగృహాలు, కళ్యాణ మండపాలు, ఊరి చివర తోటల్లో, బంగళాల్లో వ్యక్తులు కూటమిగా ఉంటే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులపై నిఘా పెట్టారు. శాంతిభద్రతలను ఉల్లంఘించి పరస్పర దాడులకు పాల్పడేవారిని ఏ మాత్రమూ ఉపేక్షించబోమని, అటువంటి వారిపై రౌడీషీట్లు తెరవడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు ప్రకటించారు.

ఆటోలకు గిరాకీ..

టిడిపి కూటమి జయహో బిసి సదస్సులు నిర్వహించింది. ప్రతి నియోజకవర్గంలోనూ పదిచోట్ల సమావేశాలు నిర్వహించారు. కూటమి అధికారంలోకి వస్తే డిక్లరేషన్‌తోపాటు 50 ఏళ్లకే పింఛన్, తదితర పథకాలను జనంలోకి తీసుకెళ్లారు. వీటితోపాటు పట్టణాల్లో, గ్రామాల్లో ప్రచారానికి ఆటోలను వినియోగించారు. ఆటోకు కొంత సొమ్ము చొప్పున ఇచ్చారు. 45 రోజులపాటు అభ్యర్థుల తరపున ఆటోలు సందడి చేశాయి. పార్టీ తరపున పాటలతో హోరెత్తించాయి. చంద్రబాబు, పవన్, జగన్ లను అభివర్ణిస్తూ పాటలు పల్లెల్లో మార్మోగాయి. ఇవన్నీ శనివారం సాయంత్రం ఐదు గంటలతో నిలిచిపోనున్నాయి.

మద్యం షాపుల బంద్..


ఎన్నికల ప్రచారంలో మద్యం షాపులు కళకళలాడాయి. నెల రోజుల పాటు మద్యం అమ్మకాలతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అధికంగా అమ్మకాలు జరిపితే ఎన్నికల స్క్వాడ్ తనిఖీలు చేసి ఆరా తీసింది. దీంతో పరిమితికి మించి అమ్మకాలకు ప్రభుత్వ షాపుల సిబ్బంది బెంబేలెత్తిపోయారు. శనివారం సాయంత్రం జిల్లాలోని 195 మద్యం షాపులు, 26 బార్‌లు మూతపడ్డాయి. మరలా 13వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు తెరచుకోనున్నాయి.

ఎత్తుకు పైఎత్తులు..

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో వైసిపి, టిడిపి మైండ్‌గేమ్ ఆడారనే విమర్శలున్నాయి. ఇప్పడికే వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్నారనే కారణంతో కార్యకర్తలను ఉపయోగించి ఒక అభ్యర్థి దాడి చేశారని కేసులు పెట్టించారు. సదరు అభ్యర్థి తరపున కూడా ఇదే తరహా ప్రయత్నాలు జరిగాయి. ఇక నియోజకవర్గంలో ప్రస్తుత ఎంఎల్ఎ అవినీతికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ అభ్యర్థి ఆరోపణలు గుప్పించారు. నియోజకవర్గంలో గత పదేళ్లలో అవినీతి, అకమాలపై ఆరోపణలు వెల్లువెత్తాయి.



ఓటు వేసేయండిలా..



ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 13న మన రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. రాబోయే ఐదేళ్లపాటు దేశాన్ని, రాష్ట్రాన్ని ఎవరు పాలించాలో నిర్ణయించే ముఖ్య ఎన్నికలు ఇవి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఎన్నికలు కాబట్టే అన్ని రాజకీయ పార్టీలూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మరోవైపు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కూడా అన్ని చర్యలు తీసుకుంది. ప్రతి ఓటరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలంటే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. అంతటి ప్రాముఖ్యత కలిగిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే విధానం గురించి తెలుసుకుందాం.

పోలింగ్ కేంద్రాన్ని ఎలా కనుగొనాలి?

గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రం కనుక్కోవడం సులభమే. పట్టణాలు, నగరాల్లో అనేక పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల ఓటర్లు కొంత అయోమయానికి గురవుతారు. తమ పోలింగ్ స్టేషన్ ఎక్కడుందో తెలుసుకోవడానికి ఇబ్బంది పడతారు. అలాంటి వారు పోలింగ్ స్టేషన్‌ను కనుక్కోవడానికి మూడు ప్రధాన మార్గాలు ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్ యూజర్లు ప్లే స్టోర్ నుండి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో 'know your poling station' విభాగంలో ఓటరు వివరాలను పొందుపరిస్తే పోలింగ్ స్టేషన్ వివరాలు వస్తాయి. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో కూడా పోలింగ్ కేంద్రాన్ని కూడా కనుగొనవచ్చు. ఓటరు గుర్తింపు కార్డుపై ఇచ్చిన ఎపిక్ నెంబర్ ద్వారా, మొబైల్ నంబర్ ద్వారా పోలింగ్ కేంద్రాన్ని గుర్తించొచ్చు. ఓటింగ్‌కు ముందు బిఎల్ఓ ఇచ్చిన ఓటర్ స్లిప్‌లో కూడా పోలింగ్ కేంద్రం, బూత్ నంబర్ సహా పూర్తి సమాచారం ఉంటుంది. ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్ 1950కి కాల్ చేసి కూడా ఓటరు తన సమాచారాన్ని అడగొచ్చు.

ఓటయేడానికి ఏమేం తీసుకెళ్లాలి?

పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే ముందు ఓటరు తన ఓటర్ ఐడి లేదా ఇతర ఫొటో గుర్తింపు కార్డులు, ఓటర్ స్లిప్పులను తీసుకెళ్లాలి. ఓటర్ ఐడి కార్డు లేకున్నా ఓటెయ్యొచ్చు. ఓటర్ స్లిప్ అనేది ఎన్నికల అధికారులు మీ ఇంటి వద్దకే వచ్చి ఇస్తారు. ఒకవేళ ఓటర్ స్లిప్ ఇవ్వకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పోలింగ్ బూత్ వద్ద లేదా రాజకీయ పార్టీల ఏజెంట్ల వద్ద కూడా పొందవచ్చు.

పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ ప్రక్రియ ఎలా?

మీరు పోలింగ్ బూత్‌లోకి అడుగు పెట్టగానే మొదటి అధికారి ఓటరు జాబితాలో మీ గుర్తింపు కార్డులోని పేరుతో పరిశీలిస్తారు. ఓటరు జాబితాలో మీ పేరుందో, లేదో చెక్ చేసి, మీ ఐడి కార్డును తనిఖీ చేస్తారు. పోలింగ్ ఏజెంట్ కూడా జాబితాలో పేర్లు సరిచూసుకుంటారు.

రెండో అధికారి మీ వేలికి సిరా వేస్తారు. ఆ తర్వాత పార్లమెంట్, అసెంబ్లీకి రెండు చీటీలు ఇస్తారు. అలాగే రిజిస్టర్‌లో మీతో సంతకం చేయిస్తారు.

మూడో అధికారి ఆ చీటీని చెక్ చేసి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం) కంపార్టుమెంట్ దగ్గరకు పంపిస్తారు. ముందుగా మీరు పార్లమెంట్ అభ్యర్థికి ఓటు వేయాలి. ఆ తరువాత ఎంఎల్ఎ అభ్యర్థికి వేరే కంపార్టుమెంట్‌లో ఓటు వేయాల్సి ఉంటుంది.

ప్రిసైడింగ్ అధికారి/పోలింగ్ అధికారి ఇవిఎం మిషన్ బటన్ నొక్కిన తరువాత ఇవిఎంలో మిమ్మల్ని ఓటు వేసేందుకు అనుమతిస్తారు.

మీరు ఇవిఎం యంత్రంపై ఉన్న అభ్యర్థుల పేర్లు, పార్టీ పేరు, ఆయనకు సంబంధించిన గుర్తు సరిగా గుర్తించి మీకు నచ్చిన అభ్యర్థికి ఎదురుగా ఉన్న బ్లూ బటన్‌పై నొక్కాలి. అప్పుడు దాని పక్కనే ఉన్న రెడ్ సిగ్నల్ వెలగడంతో పాటు పెద్దగా బీప్ శబ్దం వినిపిస్తుంది. అప్పుడు మీ ఓటు నమోదైనట్లు లెక్క.

మీ ఓటు ఎవరికి పడిందో తెలుసుకోవడానికి ఇవిఎం పక్కనే ఉన్న ఓటర్ వెరిఫియేబుల్ ఆడిట్ ట్రయల్ (వివిప్యాట్)లో ఏడు సెకన్లపాటు చూడొచ్చు.

ఒకవేళ వివిప్యాట్‌లో బ్యాలెట్ స్లిప్ కన్పించకపోయినా.. బీప్ సౌండ్ రాకపోయినా.. మీరు వెంటనే ప్రిసైడింగ్ అధికారిని సంప్రదించాలి.

పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ సిద్ధం

ఉండి రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య



ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లన్నీ సిద్ధం చేశామని ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఉండి నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందన్నారు. నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థికి, ఏజెంట్‌కు ఒక్కో వాహనానికి అనుమతి ఉంటుందని, అనుమతించిన వారు మాత్రమే వాటిని వినియోగించాలని, ఇతరులు వినియోగించరాదని తెలిపారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు మొబైల్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ప్రశ్న: ఉండి నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లున్నారు?

ఆర్ఓ: ఉండి నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,24,725 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,10,146 మంది, మహిళలు 1,14,577 మంది, టాన్స్‌జెండర్స్ ఇద్దరు ఉన్నారు.

ప్రశ్న: హోమ్ ఓటింగ్‌కు నియోజకవర్గంలో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంతమంది వినియోగించుకున్నారు?

ఆర్ఓ: హోమ్ ఓట్లు మొత్తం 151కుగాను 146 ఓట్లు పోలయ్యాయి. నలుగురు మృతి చెందగా మరొకరు ఐసియులో ఉన్నారు.

ప్రశ్న: పోస్టల్ బ్యాలెట్‌ను ఎంతమంది వినియోగించుకున్నారు?

ఆర్ఓ: 1657 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఉండి నియోజకవర్గం నుంచి 1453 ఓట్లు, ఇతర జిల్లాల ఓట్లు 204 పోలయ్యాయి.

ప్రశ్న: నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలెన్ని ఉన్నాయి?

ఆర్ఓ: నియోజకవర్గంలో మొత్తం 238 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 38 సమస్యాత్మక గ్రామాలున్నాయి.

ప్రశ్న: పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచుకునే సామగ్రి?


ఆర్ఓ: పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో 20 రకాల వస్తువులు అవసరమవుతాయి.

ఓటు వేసేందుకు వీటిలో ఏదోకటి తప్పనిసరి..

ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డుతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తేనే ఓటు వినియోగానికి అనుమతిస్తారు. వాటి వివరాలు

- ఆధార్ కార్డు
- మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డ్
- బ్యాంకు లేదా పోస్టాఫీసుల్లో ఫొటోతో జారీ చేసిన పాస్‌బుక్
- కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- ఆర్‌టిఐ ఎన్‌పిఆర్ కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు
- ఇండియన్ పాస్‌పోర్టు కలిగిన పెన్షన్ డాక్యుమెంట్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పబ్లిక్ సెక్టార్ అండ్ టేకింగ్ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు వారి ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు
- కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ జారీ చేసిన యూనిక్ దివ్యాంగ కార్డుల్లో ఏదోక గుర్తింపు

కాలుకు సర్జరీ.. అయినా ఎన్నికల విధులకు..


సర్జరీ అయిన ఉద్యోగి వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల విధులు నిర్వహించాలనే సంకల్పంతో శస్త్రచికిత్స చేయించుకున్న ఒక ఉద్యోగి తన బాధను సైతం దిగమింగి ఎన్నికల విధులకు సిద్ధమైన సంఘటన జిల్లా కలెక్టర్‌ను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. విధుల నిర్వహణలో ఏమైనా ఇబ్బంది పడతారేమో ఒకసారి ఆలోచించుకోండని వెంకటేశ్వరరావును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అడిగారు. ఆదివారం స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. సప్తగిరి

సెక్టార్ అధికారికి జిల్లా కలెక్టర్ అభినందనలు

గ్రామీణ బ్యాంకు ఉద్యోగి వెంకటేశ్వరరావు తన కాలుకు బోన్ సర్జరీ చేయించుకున్నారు. అయితే ఎన్నికల్లో సెక్టార్ అధికారిగా విధులు నిర్వహించడానికి ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చిన వెంకటేశ్వరరావును జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు. ఎన్నికల విధులకు ఏదో సాకుతో తప్పించుకోవాలనే చాలా మంది చూస్తుంటారని, అయితే వెంకటేశ్వరరావు ఎన్నికల విధుల పట్ల చూపిన నిబద్ధత అభినందించదగ్గదని అన్నారు.


ఉద్దండుల బరిలో గెలుపెవరిదో..!

ఉండి నియోజకవర్గం

ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమైంది. అభ్యర్థులు కుటుంబ సమేతంగా రంగంలోకి దిగి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గట్టి ప్రయత్నం చేశారు. 23 రోజులపాటు హోరెత్తిన ప్రచారానికి శనివారం సాయంత్రం తెరపడింది. ఆయా పార్టీల అభ్యర్థుల తరపున అధినేతలు వచ్చి ప్రచారం నిర్వహించారు.


పివిఎల్.నరసింహరాజు


కె.రఘురామకృష్ణంరాజు


వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు

ఉండి నియోజకవర్గం నుంచి మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైసిపి నుంచి ఉండి మండలం యండగండికి చెందిన పివిఎల్.నరసింహరాజు, టిడిపి అభ్యర్థిగా ఆకివీడు మండలం ఐ.భీమవరానికి చెందిన కనుమూరు రఘురామకృష్ణంరాజు, టిడిపి రెబల్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి శివరామరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు బరిలో ఉన్నారు.

ఉండి నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,24,725 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 1,10,146 మంది, మహిళా ఓటర్లు 1,14,577 మంది ఉన్నారు.

నామినేషన్ల ఘట్టం పూర్తయిన నాటి నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నిర్విరామంగా శ్రమించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర నిర్వహించారు. వైసిపి అభ్యర్థి పివిఎల్ తరపున ఆయన సోదరుడు గోపాలకృష్ణంరాజు పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టిడిపి తరపున ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఉండిలో ప్రజాగళం సభ నిర్వహించారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిత్వం తొలుత సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు ప్రకటించిన సంగతి తెలిసిందే. అనూహ్య పరిణామాల నడుమ నామినేషన్ల ఘట్టం సమయంలో మంతెన రామరాజును పక్కన పెట్టి నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణంరాజును ఎంఎల్ఎ అభ్యర్థిగా టిడిపి బరిలోకి దింపింది. రఘురామకృష్ణంరాజు తరపున ఆయన సతీమణి రమాదేవి, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని, కుమారుడు భరత్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఈ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయన సతీమణి అరుణ, కుమార్తెలు శృతి శ్రావ్య, కుమారుడు అభిరామ్‌వర్మ నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన కుటుంబ సభ్యులు నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు.


ఆత్మీయ సమావేశాలు

అభ్యర్థులు యువజన, మత, కులసంఘాలు, వివిధ యూనియన్ల నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యులు కూడా అభ్యర్థులకు ధీటుగా ప్రచారం నిర్వహించారు. మరి ఈ ప్రచారాలు, తాయిలాల పంపిణీలతో ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారనేది తెలియాలంటే వచ్చే నెల నాలుగో తేదీ వరకూ వేచిచూడాల్సిందే.

అన్నమో.. రామచంద్రా..!

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 213 పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేసేందుకు ఏలూరు కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రి తీసుకునేందుకు సుమారు 1500 మంది సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు ఆదివారం ఉదయం ఏడు గంటలకే చేరుకున్నారు. అయితే ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల సిబ్బందికి ఈసారి చేదు అనుభవం ఎదురైంది. సగం మంది అల్పాహారం తినేటప్పటికి అందరికీ అందకుండానే అయిపోవడంతో గత్యంతరం లేక కొంతమంది బయటకు వెళ్లి తిన్నారు. ఇక మధ్యాహ్నం భోజనం పరిస్థితి అయితే మరీ అధ్వానం. మధ్యాహ్నం 12:30కే కూరలు అయిపోవడంతో కొంతమంది కేవలం సాంబారు, పెరుగుతో మాత్రమే భోజనం పూర్తి చేశారు. మరో 20 నిమిషాల్లో సాంబారు, పెరుగు కూడా అయిపోవడంతో ప్లేట్లలో అన్నం వడ్డించుకుని కూరలు వస్తాయని ఎదురు చూశారు. మధ్యాహ్నం భోజనానికి రెండు కౌంటర్లు ఏర్పాటు చేయగా ఒక కౌంటర్లో సాంబారు, పెరుగు ఉన్నాయని తెలియడంతో మొదటి కౌంటర్లో అన్నం వడ్డించుకుని రెండో కౌంటర్ వైపు సిబ్బంది పరుగులు తీశారు. ఐదు నిమిషాల్లో అక్కడ కూడా సాంబారు అయిపోవడంతో కొద్దిమంది పెరుగుతోనే భోజనం పూర్తి చేశారు. మరో రెండు నిమిషాల్లో పెరుగు కూడా అయిపోవడంతో అన్నం వడ్డించుకున్న ప్లేట్లతో చాలామంది చాలాసేపు ఎదురు చూశారు. మరి కొంతమంది అసంతృప్తితో అన్నంతో నిండిన ప్లేట్లను కిందపడేసి వెనుదిరిగారు. తామంతా ప్రభుత్వ ఉద్యోగులమని, గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నామని, తమకు భోజనం కూడా పెట్టకుండా ఇలా అవమానించడం సరికాదని విచారం వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అలాగే అన్నం ప్లేట్లు పట్టుకుని కొంతమంది ఎదురు చూశారు. కొద్దిసేపటికి అన్నంలో కలుపుకునేందుకు ఎలాంటి గ్రేవీ లేని మీల్‌మేకర్ కూర తీసుకువచ్చి వడ్డించడంతో అలాగే భోజనం పూర్తి చేసి విధులకు వెళ్లిపోయారు. శిక్షణ తరగతుల్లోనూ ఇలాగే జరిగిందని, సరైన భోజనం


సాంబారు, కూరలు వేయకపోవడంతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

పెట్టలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందితోపాటు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఉన్న సిబ్బంది పోలీసులు, ఇతర సిబ్బంది కలిపి మొత్తం రెండు వేల మంది వరకు ఉండగా భోజనం ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారో అర్థం కాని ప్రశ్నగా మారింది. భోజనం ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ మాత్రం తమకు తక్కువ సంఖ్య చెప్పారని, ఇప్పుడు ఎక్కువమంది వచ్చి భోజనం చేశారని, అందుకే కూరలు సరిపోలేదని చెబుతున్నారు. భోజనాల దగ్గర ఇంత గందరగోళం జరుగుతున్నా రిటర్నింగ్ ఆఫీసర్‌గాని, ఇతర అధికారులుగాని అటువైపు రాకపోవడం గమనార్హం. అయితే తొలుత సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం భోజనాలు ప్రారంభంలో వడ్డించడంతోపాటు భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ఆయన చివర వరకూ ఉన్నా.. మధ్యలో వచ్చినా అధికారుల వైఫల్యం ఏమిటో తెలిసేదని పోలింగ్ సిబ్బంది వ్యాఖ్యానించడం విశేషం.


ఉద్యోగులకు భోజనాలు వడ్డిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 213 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని ఆదివారం ఉదయం నుంచి సిబ్బందికి పంపిణీ చేశారు. మొత్తం 22 సెక్టార్లుగా విభజించి, 65 బస్సుల ద్వారా సిబ్బందిని, సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు నాగాలాండ్ నుంచి వచ్చిన పోలీసులను సిబ్బందితోపాటు పంపించారు. సాధారణ పోలింగ్ కేంద్రాలకు లోకల్ పోలీసులను వినియోగించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయటంతోపాటు ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు కూలర్లను కూడా ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులు బస్సుల వద్దకు చేర్చేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌లు మోసే అవసరం తప్పింది.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

పశ్చిమ జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు

ఇవిఎంలు, పోలింగ్ సామగ్రి కేంద్రాలకు తరలింపు

పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు పశ్చిమ సిద్ధమైంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఓటర్ల తుది జాబితా విడుదల దగ్గర నుంచి పోలింగ్ నిర్వహణ వరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా నామినేషన్ల పర్వం నుంచి ఉపసంహరణ అనంతరం ఇవిఎంలు, వివి ప్యాడ్‌లో పరిశీలన వాటి తరలింపు వంటి అన్ని విషయాల్లో అధికారి యంత్రం అప్రమత్తమైంది. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు ఇవిఎంలు, వివి పాడ్లును పకడ్బందీగా తరలించారు. ఇప్పటికే జిల్లా అంతట 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,463 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోమన్నారు. దీనిలో పురుషులు 7,21,532 మంది, మహిళలు 7,51,313 మంది, ఇతరులు 78 మంది ఉన్నారని చెప్పారు. 282 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. జిల్లాలో మొత్తం 10,233 మంది సిబ్బంది, 1,700 మంది పోలీసులు, 1200 మంది ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఎక్స్ సర్వీస్ మెన్, రిటైర్డ్ ఉద్యోగులు ఎన్నికల నిర్వహణలో భాగస్వాములను చేశారు. పోలింగ్ రోజు ఉదయం ఏజెంట్ల సమక్షంలో నమూనా ఓటింగ్ నిర్వహించి ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన భీమవరం, ఉండి నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ల వారీగా ఇవిఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ, తదితర ఏర్పాట్లును ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణకు సామగ్రి తరలింపు పూర్తయింది. ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. తమకు ఎక్కడ నియామకం జరిగిందో తెలుసుకుని నియామక పత్రాలు అందుకోవడం, అనంతరం తమ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని స్వీకరించారు. ఆచంటలో 19 సెక్టార్లు, పాలకొల్లులో 21 సెక్టార్లు, నరసాపురంలో 16 సెక్టార్లు, భీమవరంలో 21 సెక్టార్లు, ఉండిలో 22 సెక్టార్లు, తణుకులో 23 సెక్టార్లు, తాడేపల్లిగూడెంలో 18 సెక్టార్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆచంట ఎంవిఆర్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, పాలకొల్లు ఎఎస్ఎన్ఎం డిగ్రీ కాలేజ్, నరసాపురం వైఎన్ కాలేజీ, భీమవరం, ఉండి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, తణుకు జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్, తాడేపల్లిగూడెం జెడ్‌పిహెచ్ఎస్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఇవిఎంల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఉదయం 6:30 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూములను తెరిచి ఇవిఎంల పంపిణీ ప్రారంభించారు. ఇవిఎం పంపిణీ ప్రక్రియను నిర్విఘ్నంగా పూర్తి చేశారు. సిబ్బందికి సెక్టార్, రూట్లు వారీగా బస్సులు ఏర్పాటు చేసి బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు పంపించారు.

మాక్ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 13వ తేదీ సోమవారం జరిగే పోలింగ్‌కు పాలకొల్లు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకొని సోమవారం తెల్లవారుజామున 5:30 గంటలకు జరిగే మాక్ పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి యథాతథంగా పోలింగ్ నిర్వహిస్తారు. మహిళా సిబ్బంది సైతం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి బస చేశారు.

ఏలూరు, పశ్చిమగోదావరి ఎన్నికల అధికారుల ఫోన్ నెంబర్లు

ఏలూరు జిల్లా ఆర్‌ఒల ఫోన్ నెంబర్లు

1.ఏలూరు పార్లమెంట్	ప్రసన్న వెంకటేష్	9100319100
2.దెందులూరు అసెంబ్లీ	లావణ్యవేణి	9491041415
3.పోలవరం అసెంబ్లీ	సూర్యతేజ	9490957004
4.ఉంగుటూరు అసెంబ్లీ	ఖాజావలీ	9491041424
5.ఏలూరు అసెంబ్లీ	ఎం.ముక్కంటి	9494511736
6.చింతలపూడి అసెంబ్లీ	కె.అద్దయ్య	9491041426
7.నూజివీడు అసెంబ్లీ	వి.భవానిశంకరి	9849903964
8.కైకలూరు అసెంబ్లీ	కె.భాస్కర్	8500667699

పశ్చిమగోదావరి జిల్లా ఆర్‌ఒల ఫోన్ నెంబర్లు

1.నర్సాపురం పార్లమెంట్	సుమిత్‌కుమార్	8877897789
2.ఉండి అసెంబ్లీ	సివి.ప్రవీణ్‌ఆదిత్య	9888639678
3.ఆచంట అసెంబ్లీ	వి.స్వామినాయుడు	9153112266
4.పాలకొల్లు అసెంబ్లీ	బి.శివనారాయణరెడ్డి	8186038738
5.నర్సాపురం అసెంబ్లీ	ఎంఎ అంబరీష్	9491041423
6.భీమవరం అసెంబ్లీ	కె.శ్రీనివాసులురాజు	6302023578
7.తణుకు అసెంబ్లీ	బివి.రమణ	9849905817
8.తాడేపల్లిగూడెం అసెంబ్లీ	కె.చెన్నయ్య	6281233255

నేడే పోలింగ్.. అన్ని ఏర్పాట్లు పూర్తి

ఓటర్లకు భారీ ఎత్తున తాయిలాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గంలో పోలింగ్‌కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వట్లూరులోని సిఆర్ఆర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బందికి వివిప్యాట్లు, ఇతర సమాగ్రీ అందజేశారు. నియోజకవర్గంలో 2,24,013 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,08,913 మంది పురుషులు, 1,15,089 మంది మహిళలు ఓట్లు కలిగి ఉన్నారు. వీరంతా ఈనెల 13న ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 16 మంది పోటీ పడుతున్నారు. వీరిలో 2 జాతీయ పార్టీలకు చెందిన వారుకాగా, 2 అనుమతి పొందిన రాష్ట్ర పార్టీలకు చెందినవారు, మరో ఇద్దరు రిజిస్టర్డ్ పార్టీల నుంచి, మరో ఇద్దరు రిజిస్ట్రేషన్ పొందని పార్టీలకు చెందిన వారు, 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా వైసిపి అభ్యర్థి కోటారు అబ్బయ్య చౌదరి, టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ మధ్యే పోటీ నెలకొంది. ఆదివారం రాత్రి వరకు ఇంటింటికీ పంపకాలు జరుగుతూనే ఉన్నాయి. ఓటుకు రూ.1500 నుంచి రూ.2 వేలు చొప్పున పంచినట్లు సమాచారం. పంపకాలు బహింగంగానే సాగుతున్నా.. ఎక్కడా పోలీసులు కానరాలేదు. నియోజకవర్గంలోని పెడపాడు, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ పరిధిలో ఓటుకి రూ.1500 నుంచి రూ.2 వేలు చొప్పున పంపిణీ చేపట్టారు. డ్వాక్రా సంఘాలకు నగదు పంపిణీకి వీలుగా గ్రూప్‌లీడర్లు, స్థానిక నేతలను ఒక పార్టీ వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో 239 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేసారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పిఒ, 3 ఎపిఒలు, 1000 మంది ఉన్న కేంద్రాల్లో 4 మంది ఒపిఒలు చొప్పున 239 కేంద్రాలకు ఇలా నియమించడం జరిగింది. ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభించి ప్రతి రెండు గంటలకు ఎన్ని ఓట్లు పోలయ్యాయో వివరాలు యాప్ నందు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ శాతాన్ని అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది.

పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రమునకు 100మీ పరిధిలో మొబైల్ ఫోన్ వాడరాదు. 200 మీటర్ల పరిధిలో ఓటర్లను ప్రభావితం చేయుట, ప్రచార గుర్తులు ప్రదర్శన చేయుట నిబంధనలకు విరుద్ధము. కావున సదరు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నియమావళి మేరకు తగు చర్యలు తీసుకోనబడును. ఇప్పటికే 144 సెక్షన్ అమలులో ఉంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుటకు పోటి చేయు అభ్యర్థులందరూ సహకరించాలని తెలిపారు.

పోలింగ్‌కు.. సర్వం సిద్ధం..

ఏలూరు అర్బన్:ప్రజా తీర్పుకు సమయం ఆసన్నమైంది. ఐదు సంవత్సరాల పాటు తమ భవిష్యత్తును, తమ పిల్లల భవిష్యత్తును నిర్దేశించే నేతలను ఎన్నుకోవటానికి ప్రజలకు ఉన్న ఒకే ఒక్క అవకాశం ఓటు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,35,345 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 1,12,426 మంది కాగా స్త్రీలు 1,22,872 మంది ఉన్నారు. ఇతరులు 47 మంది ఉన్నారు. వీరందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 213 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన శనివారప్పేట, సత్రంపాడు, తంగెళ్ళమూడి, చోదిమెళ్ళ, పోణంగి, వెంకటాపురం, కొమరవోలు గ్రామాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియనుంది. పోలింగ్ అనంతరం ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ బాక్సలను వట్లూరులోని సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచనున్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

యధేచ్ఛగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి - ఆకివీడు

సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం పూర్తయినప్పటి నుంచి 48 గంటల పాటు మద్యం విక్రయాలు ఆపివేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు శనివారం సాయంత్రం నాలుగు గంటలకు అబ్కారి శాఖాధికారులు సీలు వేశారు. సీలు సీలు లాగే ఉంది. రాత్రి అమ్మకాలు షాపు వెనుక యధేచ్ఛగా సాగాయి. ఆదివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. షాపు వద్దే మందుబాబులు మద్యాన్ని తాగుతున్నారు.

ఓట్లకు నోట్ల పంపిణీ

పెనుమంట్ర :ఎవరెన్ని హితవు వాక్యలు చెప్పినా, ఓట్లకు నోట్ల పంపిణీ యథేచ్ఛగా సాగుతూనే ఉందని ప్రజాస్వామ్య వాదులు వాపోతున్నారు. మండలంలో ప్రధాన పార్టీలు ఓటుకు రెండు వేలు, రూ.వెయ్యి వార్డులు వారీగా చేశారని, ఓటరే ఎదురు వెళ్లి మరీ నోట్లు తెచ్చుకున్నారని వారన్నారు. ఎవరు ఎలా పంచినా, సమతూకం లేని నోట్ల పంపిణీ వల్ల పోలింగ్ మారుతుందని వారన్నారు. తక్కువ పంపిణీ చేసినవారికి గెలుపు పట్ల ధీమా ఉండడమో, ఓటమి తప్పదని అనుకోవడమో జరిగి ఉంటుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఓటు వేయడానికి చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌ల నుంచి వచ్చిన ఓటర్లు ప్రధాన రెండు పార్టీల నుంచి ట్రావెల్ టిక్కెట్ల డబ్బులు ఎగబడి మరీ అందుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని వారు వాపోయారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

టి.నరసాపురం:వివాహితతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో వ్యక్తి కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన టి.నరసాపురంలో ఆది వారం వెలుగు చూసింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం గ్రామానికి చెందిన వివాహితతో అదే గ్రామానికి చెందిన పెసనగంటి మంగరాజు అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఈనెల 10న వివాహిత భర్త, మంగరాజు మధ్య గొడవ జరిగింది. ఈనేపథ్యంలో మంగరాజు వివాహిత భర్త వీరాస్వామిని కత్తితో పొడిచాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ వీరాస్వామి ఆదివా రం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి జీలుగుమిల్లి సిఐ క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉంగుటూరులో గెలుపుపై ఉత్కంఠ

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన రాజకీయ పార్టీలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరులో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్‌ను నిజం చేసేందుకు అధికారి పార్టీ వైసిపి, జనసేన పార్టీలు తలపడుతున్నాయి. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావు, జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పోటీ పడుతున్నారు. వారి సొంత మండలంలో పట్టు కోసం ఆది నుంచి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. ఓటర్లకు డబ్బులు పంపిణీలో తొలుత వైసిపి రూ.రెండు వేలు, పలు చోట్ల చీరలు పంపిణీ చేశారు. జనసేన ముందు రూ.1500 ఇచ్చి తరువాత మిగతా రూ.500 ఇచ్చి సమం చేశారు. కొన్ని గ్రామాల్లో జనసేన పార్టీ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చేపలు, జాకెట్ ముక్కలు పంచిపెట్టగా, వైసిపివారు కొన్ని గ్రామాల్లో చీరలు పంపిణీ చేశారు. అయితే జనసేనకు పట్టున్న గ్రామాల్లో వైసిపి వారు డబ్బులు పంపిణీ సక్రమంగా చేయలేదని,



వాసుబాబు | ధర్మరాజు | హరికుమార్‌రాజు

అలాగే వైసిపికి పట్టున్న గ్రామాల్లో జనసేన డబ్బులు అందరికీ పంపిణీ చేయలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాలంటీర్ల కటుంబాలకు జనసేన డబ్బులు ఇవ్వలేదు.

వైసిపి కొత్త ఎత్తుగడ

వాలంటీర్లనే ఎన్నికల ఏజెంట్లుగా నియామకం

ఎలాగైనా గెలుపే లక్ష్యంగా వైసిపి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. పలు మేజర్ గ్రామాల్లో వాలంటీర్లతో ఓటుకు నోట్లు పంపిణీ చేశారు. పోలింగ్ బూత్‌లో ఎన్నికల ఏజెంట్లుగా వాలంటీర్లను నియమించడం వెనుక రాజకీయ కోణం కనిపిస్తోంది. సంక్షేమ పథకాలు ఇంటింటా అందించిన వాలంటీర్లు పోలింగ్ కేంద్రాల్లో ఉంటే ఓటు వేసే వారు వాలంటీర్లను చూసి వారు గతంలో అందించిన సేవలను మననం చేసుకుని ఓటు వేస్తారనే నమ్మకంలో ఈసారి వీరిని ఏజెంట్లుగా నియమించినట్లు తెలుస్తోంది. కాగా ఇరు పార్టీలు పంపకాలకు పొరుగూరుల నుంచి ఆయా పార్టీ నమ్మిన బంటులను తీసుకొచ్చారు. రసవత్తరంగా సాగుతున్న ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ మెజార్టీని పెద్దగా లెక్కేయకుండా గెలిస్తే చాలు అనే ఆలోచనలో ఓ పార్టీ ఉండగా ఏమైనా సరే ఐదంకెల మెజార్టీ సాధిస్తామని ప్రగాల్భాలు పలుకుతోంది మరో పార్టీ. ఈ తరుణంగా ఓటరు తీర్పు కోసం ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు ఉంగుటూరు నియోజకవర్గ ఓటర్లు.

రసవత్తరంగా గూడెం రాజకీయం

గెలుపుపై ఎవరి ధీమా వారిదే



కొట్టు సత్యనారాయణ | బొలిశెట్టి శ్రీనివాస్ | మార్నీడి బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లా రాజకీయాలను పెను ప్రభావితం చేయగలిగేది తాడేపల్లిగూడెం నియోజకవర్గ రాజకీయం. ఇక్కడ ఆది నుంచి కాపు సామాజిక తరగతికి చెందిన వారే ఎంఎల్ఎలు అవుతూ వచ్చారు. అత్యధిక ఓట్లు కలిగిన కాపులకే అన్ని రాజకీయ పార్టీలు ప్రధాన పీఠం వేస్తున్నారు. దీంతో ఈ నియోజకవర్గం కాపుల నియోజకవర్గంగా పేరొందింది. వార్షికంగా వెయ్యి కోట్ల వాణిజ్యం కలిగి వాణిజ్య కేంద్రంగా తాడేపల్లిగూడెం ఇక్కడ కేంద్రీయ విద్యాసంస్థలు, రాష్ట్ర యూనివర్సిటీలు నిర్మించడంతో ఒక్కసారిగా విద్యా కేంద్రంగా రూపాంతరం చెందింది. జిల్లాలోనే అత్యధికంగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్న నియోజకవర్గం తాడేపల్లిగూడెం మాత్రమే.

తాడేపల్లిగూడెం ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు : ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీలైన వైసిపి నుంచి సిట్టింగ్ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, ఇండియా వేదిక తరుపున మార్నీడి బాబ్జి పోటీలో ఉండగా, జై భారత్ నేషనల్ తరపున భూషణ బోయిన ఆంజనేయులు, నవరంగ్ కాంగ్రెస్ తరపున పోలిశెట్టి శ్రీనివాసరావు, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) తరపున మరపట్ల రాజు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మేక వెంకటేశ్వరరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పిఎస్ఆర్ కృష్ణ, ఉంగరాల పద్మ, నడపర అచ్యుత కుమార్, బొలిశెట్టి రాజేష్, లంకా ప్రసాద్, సిరి వరపు సింహాచలం స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాలతో తన గెలుపు ఖాయమని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ ధీమాను వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా, రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిన వైసిపి ప్రభుత్వంపై విసిగెత్తి ఉన్న ప్రజలు టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలుస్తానని జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ధీమాతో ఉన్నారు. రాష్ట్ర భవిష్యత్, ప్రత్యేక హోదా ఇండియా వేదిక కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, తాడేపల్లిగూడెం ప్రజలు కాంగ్రెస్‌ని గెలిపిస్తారని, సామాన్యుడిగా అడుగుతున్నాను.. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి, తాడేపల్లిగూడెం పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఇండియా వేదిక కాంగ్రెస్ అభ్యర్థి మార్నీడి బాబ్జి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో విజయం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలైన స్కిల్ దునియా, స్టార్ టెక్, టాలెంట్ సర్వీస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ జాబ్ మేళాలో శ్రీసూర్య కళాశాల విద్యార్థులు స్కిల్ దునియాకు 22 మంది, స్టార్టర్స్‌కు 12 మంది, టాలెంట్ సర్వీస్‌కు 13 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులందరినీ శ్రీసూర్య డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ అభినందించి, మాట్లాడుతూ శ్రీసూర్య కళాశాలలో డిగ్రీ ప్రారంభం నుంచి అర్థమెటిక్, రీజనింగ్, కమ్యూనికేషన్స్ క్లాసెస్ రెగ్యులర్‌గా జరగడం వల్ల విద్యార్థులు ఉద్యోగాలు సాధించే దిశగా కళాశాల నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరూ జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ ఇండియా సిఇఒ వేణుగోపాల్, కళాశాల అకడమిక్ అడ్వైజర్స్ బోయి రామచంద్రారెడ్డి, డాక్టర్ జానకీ రామ్, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ ఫాజల్, డాక్టర్ ఎఆర్ఎస్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ పి.పుల్లారావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎ.కేశవ్, కంప్యూటర్ ఫ్యాకల్టీ కె.సత్యకుమారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి

ఆర్ఒ శివనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ సామాగ్రి నియోజకవర్గంలోని 190 పోలింగ్ కేంద్రాలకు ఇవిఎం, పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు. ఆర్ఒ శివనారాయణ రెడ్డి సారథ్యంలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఇవిఎంలను 21 రూట్లలో ఏర్పాటు చేసిన బస్సులలో పంపిణీ చేశారు. ఇందుకోసం కళాశాలలో భారీ టెంట్లు ఏర్పాటు చేశారు. సిబ్బందికి భోజన వసతి ఏర్పాటు చేశారు. మొత్తం 1140 మంది సిబ్బందిని వినియోగించారు. నాగాలాండ్ సిఆర్‌పిఎఫ్ దళాలు ప్రతి రూటులో ఏర్పాటు చేశారు. ప్రయివేట్ బస్సులను సైతం వినియోగించారు. మధ్యాహ్నం వరకు వాతావరణం ఎండగా ఉన్న తరువాత చల్లబడింది.

పాలకొల్లులో గెలుపు కోసం విశ్వప్రయత్నాలు

విజయం ఎవరిని వరించేనో..!



గుడాల గోపి | రామానాయుడు | అర్జునరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు మూడోసారి విజయం సాధించి హేట్రిక్ సాధించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. తొలిసారి పాలకొల్లులో వైసిపి జెండా రెపరెపలాడించాలని వైసిపి నేతలు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకొల్లు సీటుపై జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. గత 10 సంవత్సరాలుగా నిత్యం ప్రజల మధ్య ఉండటం నిమ్మలకు కలిసొచ్చే అంశం. 4 నెలల ముందే గుడాల గోపి పాలకొల్లు ఇన్‌ఛార్జిగా రావడంతో ఆయన నియోజకవర్గంకు కొత్త అయ్యారు. తొలుత ప్రచారం మందంగా ఉన్న ప్రస్తుతం పోటీ నువ్వా.. నేనా.. అనే రీతిలో జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు జనార్ధన్ కూడా గట్టి పోటీ ఇచ్చారు. ఈసారి వైసిపికి పలుచోట్ల ఎదురు గాలి వీస్తున్న నేపథ్యంలో పాలకొల్లు సీటు గెలుపుపై పందేలు జరుగుతున్నాయి. మొత్తం 1,95,057 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

ఆకివీడు: మండలంలోని 66 పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధం అయింది. సాయంత్రం 6 గంటల నుంచి క్రమంగా సిబ్బంది ఆయా పోలింగ్ స్టేషన్‌లకు చేరారు. పోలింగ్ మెటీరియల్‌తో సహా సిబ్బంది సర్వం సిద్ధమయ్యారు. అధికారులు ప్రతి బూత్ వద్ద ఒక వీల్ ఛైర్, మంచినీరు ఓటరు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలు, టెంట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ పోలీసు సిబ్బంది కూడా స్టేషన్ల వద్దకు చేరారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

తహశీల్దార్ భాస్కరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని 17 పంచాయతీలలో మొత్తం 59,661 మంది ఓటర్లు ఉన్నారని తహశీల్దార్ భాస్కర రావు తెలిపారు. సోమవారం జరగనున్న పోలింగ్‌లో 59 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన ఏర్పాటు చేసామన్నారు. సిబ్బంది అందరూ కూడా పోలింగ్ కేంద్రాలకు ఆయా సామాగ్రితో తరలి వచ్చారన్నారు. మండలంలో ఆరు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ప్రశాంత వాతావరణంలో అత్యధిక శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

వర్షం.. తడిసిన ఎన్నికల సామగ్రి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అకాల వర్షం కారణంగా ఎన్నికల్లో వినియోగించే ఎన్నికల సామాగ్రి ఒకసారిగా తడిసిపోయాయి. వే సవికాలం కావడంతో ఎండలు మండుతున్నాయి. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కోసం ఆరుబయట క్లాత్, టెంట్లు వినియోగించి ఎన్నిక అధికారులు ఎన్నికల సామాగ్రిని ప్రాంతాల వారీగా పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. ఇదే టెంట్ నుంచి ఎన్నికల అధికారులు వారి బూత్‌కి కావలసిన ఎన్నికలు సామాగ్రిని ఆయా అధికారులు తీసుకు వెళ్లవలసి ఉంది. అందుకోసం బస్సులు కూడా సిద్ధం చేశారు. ఇంతలో ఉన్నట్టుండి అకాల వర్షం రావడంతో ఎన్నికల సామాగ్రి వర్షానికి తడిచిపోయింది. అక్కడ ఉన్న సిబ్బంది కొంతమేర తడవకుండా చేశారు.




తడిసిన ఎన్నికల సామాగ్రి

తడిసిన వరి మాసూళ్లు

పెనుమంట్ర: అకస్మాత్తుగా ఆదివారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం వరకు ఎండవేడిమితో ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, మేఘాలు కమ్మి, భారీగా వర్షం కురవడంతో వరి మాసూళ్లు చేస్తున్న రైతులు ధాన్యంను కాపాడు కోవడం కోసం ఉరుకులు, పరుగులు పెట్టారు. గోనె సంచులు సరిపడా సరఫరా లేక, ధాన్యం పట్టుబడి, ఆలస్యమైందని, ఈ వర్షం వల్ల నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

గెలుపుపై అభ్యర్థుల ధీమా

విజయం ఎవరిదో



దూలం నాగేశ్వరరావు | కావినేని శ్రీనివాస్ | బొడ్డు నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

ఎన్నికల కురుక్షేత్ర సంగ్రామం సోమవారం జరగనుంది. ఈ సంగ్రామంలో కైకలూరు అసెంబ్లీ బరిలో 15 మంది అభ్యర్థులు వివిధ పార్టీల తరపున బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో రెండు లక్షలకుపైగా ఓటర్లు వీరి భవితవ్యాన్ని తేల్చనున్నారు. అయితే గెలుపు, ఓటములపై నాయకులు ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. ఎవ్వరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఓటరు నాడీని ఎవ్వరు పట్టుకుంటారనేది చర్చనీయాంశమైంది. మార్చి 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి శనివారం వరకు ఎడతెగని ప్రచారాలు చేశారు. శనివారం ప్రచార పర్వం ముగియటంతో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓటుకు రూ.2 వేల నుంచి 500 వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఏప్రిల్ 19న నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 21 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరిలో వివిధ కారణాల రీత్యా ఐదుగురు సభ్యులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకున్నారు. అభ్యర్థుల గుర్తులు కేటాయించేసరికి 16 మంది మాత్రమే బరిలో ఉన్నారు. వీరిలో ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్, ఎన్‌డియే కూటమి బలపరిచిన బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, వైసిపి అభ్యర్థి దూలం నాగేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరపున నాగేశ్వరరావు, ఫార్వర్డ్ బ్లాక్ తరపున లావేటి వీరశివాజీ, జై భీమ్రావు తరపున సతీష్‌లతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరంతా తమ తమ పద్ధతుల్లో ప్రచారం నిర్వహించారు. దాదాపు నెల రోజులపాటు మైకులు హోరెత్తించారు. కరపత్రాలు, పోస్టర్లు, జెండాలు ఇతర ప్రచార సామగ్రిని వినియోగించారు. వీటితోపాటు సోషల్ మీడియా ప్రచారం ఈ ఎన్నికల్లో మరింత ఊపందుకుంది. ప్రచార పర్వంలో వైసిపి అభ్యర్థి విజయాన్ని కోరుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి కైకలూరు తాలూక సెంటర్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థి విజయాన్ని కోరుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్, సినీ నటుడు విక్టరీ వెంకటేష్, పలువురు సినీ దర్శక నిర్మాతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన పార్టీ అభ్యర్థులు మాత్రమే ఓటర్లకు డబ్బు, మద్యం పంచుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఓటరుకు రూ.2 వేల చొప్పున ఆయా పార్టీలు ఇప్పటికే పంపిణీ చేశాయి. మద్యం, డబ్బు పంపిణీలను అరికట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటములపై నియోజకవర్గంలో భారీగా పందేలు కాస్తున్నారు. అయితే ఓటర్ మహారాజ్ తీర్పు ఎలా ఉండబోతుంది అనేది వేచి చూడాల్సి ఉంది.

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

చింతలపూడి రిటర్నింగ్ అధికారి అద్దయ్య

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన పోలింగ్‌కి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చింతలపూడి రిటర్నింగ్ అధికారి పి.అద్దయ్య అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. మహిళలు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులు లేదా సిబ్బంది దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి?

ఆర్ఒ : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చాం. ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేశాం. 59 బస్సుల్లో సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించాం. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పూర్తి చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : పోలింగ్ సిబ్బంది ఎంతమంది పాల్గొంటున్నారు?

ఆర్ఒ : మొత్తం 2,500 మంది పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలకు 25 రూట్లుగా విభజించాం. 25 మంది రూట్ ఆఫీసర్లతో 59 బస్సులను ఏర్పాటు చేశాం.

ప్రశ్న : చింతలపూడి నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక కేంద్రాలు ఏమైనా గుర్తించారా? ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు?

ఆర్ఒ : నియోజకవర్గ పరిధిలో 273 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. 132 సమస్మాత్మక పోలింగ్‌కేంద్రాలుగా గుర్తించాం. అక్కడ కూడా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : సమస్యాత్మక కేంద్రాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆర్ఒ : సమస్మాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించడం జరుగుతుంది. అలాగే ప్రతి లొకేషన్‌లో ఒక మైక్రో అబ్జర్వర్ పని చేస్తారు. 172 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. వాటి పర్యవేక్షణ కొనసాగుతుంది.

ప్రశ్న : పోలింగ్ రోజు ఎలాంటి నిబంధనలు అమలులో ఉంటాయి?

ఆర్ఒ : ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. 200 మీటర్ల బయట మాత్రమే అభ్యర్థులు తమ టెంట్లు ఏర్పాటు చేసుకోవాలి. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదు. ఎవరైనా గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటాం. వారి రౌడీషీటర్ కూడా ఓపెన్ చేస్తారు. ఓటు వేసి తిరిగి ఇంటికి వెళ్లిపోవాలి. పోలింగ్ కేంద్రాల లోపలికి మొబైల్ ఫోన్ల అనుమతి లేదు.

ప్రశ్న : ఓటర్లకు మీరిచ్చే సలహా ఏమిటి?

ఆర్ఒ : మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎవరైనా ఆటంకం సృష్టిస్తే వెంటనే ఎన్నికల కమిషనర్‌కు గాని, అధికారులకు, స్థానిక పోలీసులకు కాని ఫిర్యాదు చేయాలి. ఓటు హక్కు బాధ్యతగా భావించాలి. పోలింగ్ శాతం వందకు వంద శాతం అయ్యేవిధంగా ప్రజలు సహకరించాలి. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

పర్యవేక్షించిన రిటర్నింగ్ అధికారులు

ప్రజాశక్తి - దెందులూరు

పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి జిల్లా అధికారులు ప్రశాంత వాతావరణంలో సామగ్రి పంపిణీ చేశారు. వట్లూరులో సర్ సిఆర్ఆర్ మహిళా కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ నిర్వహించారు. పోలింగ్‌కు సంబంధించి ఇవిఎం యంత్రాలు, వివి ప్యాట్, పోలింగ్ ప్లాట్ ఫామ్, ఇతర సామగ్రి అందించారు. సామగ్రికి సంబంధించిన చెక్‌లిస్ట్ కూడా ఇచ్చారు. సామగ్రి తీసుకున్న అనంతరం పోలింగ్ సిబ్బంది, పిఒ, ఎపిఒ, ఇతర పోలింగ్ సిబ్బంది అందరూ తమకు కేటాయించిన బస్సుల్లో పోలింగ్ స్టేషన్లకు వెళ్లారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీని జెసి, రిటర్నింగ్ అధికారి లావణ్యవేణి పర్యవేక్షించారు.



చింతలపూడిలో...

నరసాపురం :పట్టణంలోని వైఎన్ కళాశాల గ్రౌండ్‌లో సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందించారు. అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో రాత్రి బస చేసేందుకు అన్ని ఏర్పాటు చేశారు. ఉదయం చినుకులు పడడంతో టెంట్‌లో ఉన్న సిబ్బంది ఉక్కపోతకు గురయ్యారు. ఎండ వేడిమి తట్టుకోలేక ఫ్యాన్లు లేకపోవడంతో పేపర్లతో విసురుకున్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకులు ఎం.దీప, నరసాపురం ఆర్ఒ అంబరీష్ పరిశీలించారు.

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో పార్లమెంట్, అసెంబ్లీలకు సంబంధించి



పాలకొల్లులో...

ఎన్నికల సామగ్రిని ఆదివారం ఉదయం జెడ్‌పి పాఠశాలలో పంపిణీ చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఉన్న 209 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఇవిఎం యంత్రాలతో పాటు పోలింగ్‌కు సంబంధించిన ఓటర్ జాబితా ఇవిఎం యూనిట్లను ఎన్నికల సిబ్బందికి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. సిబ్బందికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు 21 ఆర్‌టిసి బస్సులను, మరో 33 ప్రయివేట్ వాహనాల్లో ఇవిఎం యూనిట్లను ఆయా కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మొత్తం 2200 మంది పోలింగ్ సిబ్బంది, పోలీసులను నియోజకవర్గానికి కేటాయించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను భీమవరం కౌంటింగ్ కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమన్ని



భీమవరంలో...

తాడేపల్లిగూడెం ఆర్ఒ చెన్నయ్య పర్యవేక్షించారు. తాడేపల్లిగూడెం తహశీల్దార్ బి.మురళీకృష్ణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఆచంట : ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం సాధారణ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజవర్గంలో మొత్తం 2500 మంది పోలింగ్ సిబ్బంది విధులు పాల్గొంటున్నారు. స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకు ఆదివారం పోలింగ్ సామగ్రి అందించారు. పోలింగ్ కేంద్రాలకు ఆర్‌టిసి బస్సులు, ప్రయివేట్ వాహనాల్లో తరలించారు.

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం నారాయణపురం జెడ్‌పి పాఠశాలలో సజావుగా నిర్వహించామని రిటర్నింగ్ అధికారి



తాడేపల్లిగూడెంలో...

ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ చెప్పారు. ఉదయం సిబ్బందికి టిఫిన్ దగ్గర నుంచి భోజనాల వరకూ ఎలాంటి సమస్య రాకుండా పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఇవిఎం, ఇతర ఎన్నికల సామగ్రిలను బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు పంపించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలిచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకే సిబ్బంది అంతా వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లిపోయారు.

ముసునూరు : నూజివీడు నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బందికి ఇవిఎం, పోలింగ్ సామగ్రిని అందించారు. రిటర్నింగ్ అధికారి భవానిశంకరి ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సారధి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గంలో 159 లొకేషన్స్ ద్వారా ప్రత్యేక వాహనాల్లో ఇవిఎంలను తరలించారు. ఇవిఎంఎలలో సాంకేతిక పరమైన లోపాలు లేవని, సురక్షితంగా ఉన్నాయని నిర్ధారణ అయిన తర్వాత పోలింగ్ ప్రారంభించామని చెప్పారు. నియోజకవర్గంలో 286 పోలింగ్ కేంద్రాల్లో 2,38,104 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 1,18,104 మంది పురుషులు, 1,20,867 మంది మహిళలు, ఇతరులు ఆరుగురు ఉన్నారని తెలిపారు.



నూజివీడులో...

చింతలపూడి : మండలంలోని మార్కెట్ యార్డు వద్ద ఇవిఎం యంత్రాల పంపిణీ ఆర్ఒ పి.అద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలకు ఇవిఎం, వివి ప్యాడ్, ఇతర ఎన్నికల సామగ్రిని తరలించారు. సిబ్బంది ఇబ్బందులు పడకుండా, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. భోజన సదుపాయాలపై సిబ్బంది సంతృప్తి రక్తం చేశారు.

చింతలపూడి : మండలంలోని మార్కెట్ యార్డు వద్ద ఇవిఎం యంత్రాల పంపిణీ ఆర్ఒ పి.అద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలకు ఇవిఎం, వివి ప్యాడ్, ఇతర ఎన్నికల సామగ్రిని తరలించారు. సిబ్బంది ఇబ్బందులు పడకుండా, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించారు. భోజన సదుపాయాలపై సిబ్బంది సంతృప్తి రక్తం చేశారు.



ఉండిలో...

సౌకర్యాలు లేక సిబ్బంది అవస్థలు

ఆచంట :పోలింగ్ సిబ్బందికి తగిన సౌకర్యాలు లేక వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సరైన భోజనం అందకపోవడంతో పోలింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఖాళీ ప్లేట్లతో సిబ్బంది క్యూ లైన్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం మరోసారి భోజనం రప్పించి అరకొరగా వడ్డించారు. దీంతో పోలింగ్ సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆచంటలో వాతావరణం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో పోలింగ్ సామగ్రితో సిబ్బంది హడావిడిగా బస్సులో బయలుదేరారు.



భోజనాలో కోసం క్యూలో ఉన్న సిబ్బంది

నూజివీడులో 286 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

రిటర్నింగ్ అధికారి భవానిశంకరి

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గ పరిధిలో 286 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నూజివీడు రిటర్నింగ్ అధికారి వై.భవానిశంకరి తెలిపారు. ఆదివారం ఆమె ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నూజివీడు టౌన్, నూజివీడు రూరల్, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల ఓటర్లు 2,38,981 మంది ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో 286 పోలింగ్ కేంద్రాల్లో 286 పిఒలు, 286 ఎపిఒలు, 1600 మంది సిబ్బంది, 700 బస్సులు, 300 మంది రిజర్వ్



పిఒలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌లో ఓటర్ తమ పేరు గుర్తింపు కార్డును ఎన్నికల అధికారి పరిశీలించాక, ఓటర్ పోల్ చీటీని తీసుకుని, కంట్రోల్ యూనిట్ దగ్గరికు వెళ్లి యువిఎం మిషన్ మీద వారికి కావాల్సిన గుర్తుపై గ్రీన్ లైటు వెలిగే విధంగా తమ ఓటు హక్కును వేయాలని ఓటర్లకు తెలిపారు.